# శ్రీవారి శ్రమదానం

‘వసత్ర’

పెద్దకథ

మహారాజ రాజశ్రీ శ్రీశ్రీశ్రీశ్రీ రావుగారు

ఆ రోజు ఉల్లిపాలెంలో జరగనున్న శ్రమదాన మహోత్సవానికి ప్రారంభోత్సవం జరుపుతారన్న వార్త పరిసర గ్రామాల్లో శీతాకాలం పొగమంచులా వ్యాపించి పోయింది. చుట్టుపట్ల గ్రామాల్లో నుంచీ, పల్లెల్లో నుంచీ జనం నేల యీనినట్టుగా బయలుదేరి శ్రీవారి శ్రమదానోత్సవాన్ని చూడటానికి, వీలైతే ఉడతా భక్తి తలా పిడికెడు మన్ను మోయడానికి వచ్చారు.

సాయంకాలం నాలుగ్గంటలయే సరికి సభా వేదిక చుట్టూ జనం కిటకిటలాడుతూ కూర్చున్నారు. వేదిక నాయకుల చిత్రాలతోను, రంగు జెండాలతోనూ, పచ్చటి మామిడి తోరణాలతోనూ, కొబ్బరి మండలతోనూ అలంకరింపబడింది. శ్రీవారి అనుచరులు కొంత మంది పల్లెల్లోకి పోయి సభకు రావడానికి బద్ధకించిన మనుషుల్ని కదలేసి, మల్లేసి మరీ తీసుకొచ్చారు.

వేదికపైకి శ్రీవారి రాక కోసం ఎదురు చూస్తోన్న జనాన్ని ఉద్దేశించి శ్రీవారి అనుచరుల్లో అగ్రగామి అయిన భూషయ్య యిలా అన్నాడు—

"మహాజనులారా! కొంచెం ఓపిక పట్టండి! మన రావుగారు ఒక అరగంటలో వస్తారు! అందాకా మీరు అల్లరి చేయ్యకుండా—అంటే నిశ్శబ్దంగా కూర్చోవాలని మనవి!".

"ఇంకా ఎంత సేపయ్యా! కూర్చోవడం, ఇప్పటికే ఒక పూట పని చెడితేనూ!" వెనక భాగాన కూర్చున్న జనంలో నుంచి ఒకడు అరిచాడు.

జనం అంతా ఒక్కసారి గొల్లుమని నవ్వి వెనక్కు తిరిగి చూశారు. ఆ అరిచినవాడు గుట్టు చక్కంగా జనంలో కూర్చున్నాడు. జనంలో కలిగిన అలజడికి భూషయ్యగారికి వళ్ళు చిటపటలాడిపోయింది.

వేదిక మీద నుంచుని భూషయ్య—"సోదరులారా! నిశ్శబ్దంగా కూర్చోవాలి! ఒక్కపూట చెడినపని ఎటూ చెడిపోయింది! యిప్పుడు పోయి మీరు మాత్రం చేసేది ఏముంది! కొద్ది నిమిషాల్లోనే రావుగారు మంత్రిగారిని తీసుకు వస్తారు. రావుగారు పక్క గ్రామంలో మకాం వేసియున్న మంత్రిగారిని తీసుకురావడానికి వెళ్ళారు. ఈ పాటికి వస్తుండాలి. కూర్చోండి! కూర్చోండి!!" అని చేతులు వూపుతూ అన్నాడు.

మంత్రిగారు వస్తారన్నమాట చెవుల పడగానే లేచి నుంచున్న వాళ్ళు కూర్చోసాగారు. అలా కూర్చుంటోన్న జనాన్ని చూడగానే ఇనుమడించిన ఉత్సాహంతో వుబ్బి తబ్బిబ్బై భూషయ్య — "మహాజనులారా! ఈనాడు మనం యిక్కడ ఎందుకు సమావేశమయ్యామో మీకు ఒక్కసారి గుర్తు చేయదలచుకొన్నాను. శ్రమదానం!! శ్రమదానం చెయ్యడానికి! దేశ శ్రేయస్సు కోసం, మన గ్రామాభివృద్ధి కోసం, మనం అంతా యిక్కడ శ్రమదానం చెయ్య



దానికి సమావేశమయ్యాం!" అని యింకేదో చెప్పబోతూంతగా జనంలో నుంచి ఒకడు లేచి భూషయ్య వుపన్యాసధోరణికి అడ్డొచ్చి—

"మధ్యాహ్నం రెండు గంటలకు వస్తానన్న మంత్రి సాయంత్రం ఏడు కావస్తున్నా యింత వరకు అంతులేడు కదా! ఎంతసేపు కూర్చొమంటావయ్యా యీ ఎండలో!" అన్నాడు.

భూషయ్య గొంతు సవరించుకొని మాట్లాడబోతుండగా జనంలో మరో పక్క నుంచి ఇంకొకడు అందుకొని —

"మంత్రిగారు పక్కదారినపడి మరో ఊరు చేరారేమో చూడవయ్యా!" అన్నాడు.

జనం పక్కున నవ్వింది!


"అలా ఎప్పటికీ జరుగదు! మన రావుగారు వెళ్ళడమూ, మంత్రిగారు రాకపోవటమూనా? మీరు కొంచెం ఓపికపట్టి కూర్చోండి! మంత్రిగారూ, రావుగారూ కొద్ది క్షణాల్లోనే వస్తారు. శ్రమదానోద్యమ చరిత్రలో మన ఊరి పేరు సువర్ణాక్షరాల్లో లిఖించబడబోతూంది. కొద్ది నిమిషాల్లోనే మన ఊర్లో ఒక అపూర్వమైన సంఘటన జరగబోతూంది మన గ్రామస్థులంతా కలిసి దేశంలో యింత వరకూ ఎక్కడా కనీవినీ ఎరగనంతటి శ్రమదానం చేయనున్న సమయం ఆసన్నమౌతూంది!" అన్నాడు ఉప నాయకుడు భూషయ్య ఉద్రేకంతో.

"ఆ చేస్తూనే వున్నాంగా! మధ్యాహ్నం రెండుగంటలనుంచీ ఎర్రటి ఎండలో కిందా పైనా కాల్తుంటే!" జనం మధ్యలో కూర్చున్న ఒక ముసలాడు తనలో తనే గొణుక్కున్నాడు.

"ఈ ఒక్కరోజే కాదు! యిలాంటి ఎన్నో రోజులు మనం శ్రమదానంకోసం త్యాగం చెయ్యాల్సి వుంటుంది ముందుముందు?" అని భూషయ్య దూరంగా కనపడుతున్న రోడ్డుకేసి చూశాడు.

"అదుగో! వస్తున్నారు! వచ్చేశారు మంత్రి




గారు!" అన్నాడు భూషయ్య రోడ్డుమీద మంత్రిగారి కారు లేపుతున్న దుమ్ముచూసి సంతోషంతో.

సభలో వున్న జనం అంతా లేచి మునివేళ్ళమీద నుంచొని మెడలు చాచి వేదికను సమీపిస్తోన్న మంత్రిగారి కారును చూడసాగారు.

కారులోంచి శ్రీ రావుగారు, మంత్రిగారు దిగారు. గ్రామ పెద్దలూ, శ్రమదానోద్యమ కార్యకర్తలూ మంత్రిగారిని సగౌరవంగా వేదికమీదకు తీసుకువచ్చారు. మంత్రిగారి పక్కనే వేదికమీద శ్రీ రావుగారు కూర్చొన్నారు. భూషయ్య పదేపదే చెప్పినమీదట జనం సద్దు మణిగి కూర్చున్నారు.

మంత్రిగారికి సన్మానపత్రాలు వగైరా వగైరా లాంఛనాలన్నీ పూర్తయ్యాక సదరు మంత్రిగారు శ్రమదానోద్యమ ప్రాముఖ్యాన్ని గురించీ, ఆశయాన్ని గురించీ అందుగ్గాను ప్రజలు చేయవలసిన త్యాగాల్ని గురించీ సవివరంగా ఉద్ఘాటించారు. మంత్రిగారు 'దాహం' పుచ్చుకొని తమ స్థానంలో కూర్చోగానే శ్రీ రావుగారు లేచి పైపంచె సవరించుకుని గొంతు సకిలించి అమాత్యులవారు శెలవిచ్చిన భావాల్నే తన సొంత మాటల్లో వారు గంట చెప్పింది తను ఒక అర్థగంటలో చెప్పి ముగించారు.

సభా కార్యక్రమం ముగియగానే మంత్రిగారూ, రావుగారూ తదితరులతో కలిసి ఊరి బయట శ్రమదాన కార్యక్రమం జరగాల్సిన చోటికి వచ్చారు.

ఊరికి ఆనుకొని ఉత్తరపు దిక్కునవున్న శిథిల దేవాలయ పునరుద్ధరణ, సచివోత్తముల సమక్షంలో ఆనాడు శ్రీ రావుగారి శ్రమదానంతో ఆరంభం కాబోతూంది. శ్రీ రావుగారు దేవాలయ పునరుద్ధరణకుగాను స్వయంగా గ్రామమంతా తిరిగి విరాళాలు వసూలుచేశారు. వారుకూడా పెద్దమొత్తాన్నే ఇచ్చారు. ఇటుక, రాయి, సున్నం దేవాలయ పునరుద్ధరణ నిధిలోనుంచి కొనడానికీ, కట్టడం పని అంతా గ్రామస్థుల శ్రమదానంతో పూర్తి చేయడానికీ నిర్ణయమయింది. పెద్దఎత్తున ప్రారంభోత్సవం జరగటానికి గత వారం రోజులుగా శ్రీ రావుగారు ఏర్పాట్లు చేయించారు.

మంత్రిగారి రాక ఆలస్యమయిన కారణంగా

ఆనాడు మధ్యాహ్నం రెండు గంటలకు జర గాల్సిన ఉత్సవం సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభించబడింది.

దేవాలయం ముందు పడిపోయిన ధ్వజ స్తంభాన్ని మళ్ళీ లేవనెత్తడంతో పునరుద్ధరణ కార్యక్రమమూ, వూళ్ళో తొలిసారిగా శ్రమ దానానికి ప్రారంభమూ జరుగుతూంది.

వేదోక్తంగా పూజలూ, పునస్కారాలూ జరిగి సంతోషంగా మంత్రిగారు కొబ్బరికాయ పగలకొట్టారు. శ్రీ రావుగారు ధ్వజ స్తంభానికి పునాది వేయాల్సినచోట గడ్డపలుగుతో నేల మీద ఒక్కపోటు వేశారు. గ్రామస్తులు పారలూ, పలుగులూ తీసుకొని పునాది తవ్వ డం మొదలుపెట్టారు. బస్తీనుంచి ప్రత్యేకంగా పిలిపించబడ్డ ఫోటోగ్రాఫర్ మంత్రిగారి పక్కన గునపం పట్టుకు నుంచున్న రావు గారిని ఫోటో తీశాడు.

చకచకా పలుగులూ, పారలూ ఆడాయి. గోతిలో నుంచి తీసిన మట్టితో పల్లికలు నిండాయి.

ఆ గర్భ శ్రీమంతులూ, ఇవతల పుల్లతీసి అవతల పెట్టాల్సిన అవసరం కలగని రావు గారు స్వయంగా తమ చేతులతో మట్టిపల్లి కను అమాంతం ఎత్తి నెత్తిన పెట్టుకున్నారు. ఆ దృశ్యాన్ని చూసిన గ్రామస్థులు చేసిన హర్ష ధ్వానాలతో శివాలయం ఆవరణంతా నిండి పోయింది!

రావుగారికి వళ్లు పులకరించి పోయింది; రావుగారి మనసు ఏదో లోకాల్లోనికి విసిరేయ బడింది. తను శ్రమదానం చేస్తున్నాడు స్వయంగా తను మట్టిపల్లికలు మోస్తున్నాడు అందులో మంత్రిగారి సమక్షంలో! గ్రామస్తు లకు తను మార్గదర్శకుడయాడు. ఆలోచనల ఉద్రేకంలో రావుగారు వళ్ళు మర్చిపోయాడు. పల్లికల కొద్దీ మట్టి ఎత్తి పోస్తున్నాడు. మల్లెపువ్వుల్లా వున్న తెల్లటి లాల్చీ అంతా మట్టితో పులుముకుపోయింది ముఖం మీద కారుతోన్న చెమటకు పల్లికలోంచి కారే మట్టి అతుక్కుపోతూంది. శ్రమదాన కార్యకర్త లంతా రావుగారితో పాటే మట్టి మోస్తున్నారు, రావుగారు వెనక్కు తగ్గకుండా మట్టి మోయ డం వాళ్ళకెంతో ఉత్సాహాన్ని యిచ్చింది.

ఐతే రావుగారి చేతులు ఏడో పల్లిక వచ్చే సరికి నెత్తి మీదకు ఎత్తుకోలేక పోయినై. చేతి కండరాలు పీకుతున్నాయి సత్తువకొద్దీ పల్లికను ఎత్తుకోవడానికి ప్రయత్నం చేశాడు. పళ్లు బిగించి, 'లోలోపల మక్కుతూ ఎలాగో మట్టిపల్లిక తలకెత్తుకొన్నాడు. పల్లిక మాడు మీద భగ్గున రాచుకొంది.

వెధవ పల్లిక! మరీ యింత మోటుగా వుందే! తలంతా ఒరుచుకు పోతూందేను! అన్నట్టు, మట్టిమోసే ఉప్పరి వాళ్ళు తలమీద ఏదో పెట్టుకుంటారే! ఆఁ ఆ! అదే గడ్డితో చుట్ట! అది పెట్టుకుంటే. తలమీద అది పెట్టు కోవాలిగాని యీ వెధవ సన్నపంచె తలగుడ్డ ఏమిటీ! తలంతా గీచుకుపోతూంటేను. అయినా తన తలమీద పట్టుమని గుప్పెడు జుట్టుకూడా లేదు. బట్టతల వాళ్ళకు మట్టి మోయడం చెడ్డ యిబ్బందే సుమా—!

"ఆఁ! రానీయండి పల్లిక!"

రావుగారు తన ఆలోచనల్లో నుంచి బయట పడి చేతులో వున్న పల్లిక గోతిలో నుంచున్న వాడికి అందించాడు. అతడు పల్లిక అందు కొని పల్లిక నిండా మట్టి పారతో ఎత్తి పోసోన్నాడు.

పీడ దుంపతెగ! పల్లిక మీద అంతఎత్తుగా పోస్తాడేం మట్టి! ఇదేమన్నా మట్టా, మజాకా మోయడానికి? అంత నిండు పల్లిక మోయడం మాటలా? తనవల్ల అవుతుందా? అసలు తనకు వచ్చిన పల్లిక మరీ పెద్దదలావుంది? ఆభూషయ్యా మంత్రిగారు మోసిన పల్లికలు దీని కంటే చాలా చిన్నవి కదూ? పైగా తన పల్లికఅడుగు మరీ మోటుగా అల్లాడు వాడెవడో కాని! ఎంత గోడుగా వుందో చూడు పల్లిక అడుగంతా? దీంతగలెయ్య పల్లిక! వాడి సిగగోసిన అలిక-

"ఓ రావుగారూ! ఇందా! పల్లిక!" గోతిలో నుంచి నిండు పల్లిక రావుగారి మొకుకేసి చూస్తూ వచ్చింది.

"ఆఁ! రానియ్యండి! రానియ్యండి!" బింకంగా అని రావుగారు మట్టి పల్లిక అందుకొన్నారు.

చేతులు వణుకుతున్నాయి. మట్టి పల్లిక నెత్తి మీదకు పోవడానికి మారాం చేస్తోంది. రావుగారు పళ్లు ఓగించి గుడ్లు మిటకరించి నెత్తికి ఎత్తుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. రావుగారి అవస్థ చూస్తున్న భూషయ్య వచ్చి రావుగారికి సాయంపట్టి పల్లిక నెత్తికి ఎత్తాడు.

"తస్సాదియ్య పల్లిక! ఏదంతా పుట్టలా అయిపోయింది! ముక్కుల్లోకి, కళ్లల్లోకి పల్లిక లోనుంచి మట్టి జారిపడుతూంది దీనికితోడు!" అనుకొంటూ రావుగారు పల్లి మోసుకుపోయి అంత దూరాన మట్టి కుమ్మరి వారు పల్లిక లోని మట్టి విసరబోయి యీసారి అమాంతం పల్లికనే విసిరేశాడు పాపం ఏంచేస్తాడు మరి! చేతులు పట్టుదప్పి పోతూండేనూ!

"రావుగారూ! మంత్రిగారికి 'ఎళ్ళే వేళ యిందట?" అంటూ భూషయ్య కింద వున్న మట్టి పల్లికతీసి చూస్తూ వున్న రావుగారిదగ్గరకొచ్చాడు.

"ఆ! అన్నట్టు మర్చిపోయాను! పద! మంత్రిగారిని సాగనంపుదాం!" అంటూ మంత్రిగారి కారుదగ్గరకు నడిచాడు రావుగారు.

శ్రమదాన కార్యకర్తలూ, గ్రామస్తులూ కలిసి మంత్రిగారిని సాగనంపారు. రావుగారి దగ్గర శలవు పుచ్చుకుని మంత్రిగారు మిట్ట వేదాయపాలెంలో జరుగనున్న ఆధ్యాత్మిక మహాసభలో ప్రారంభోపన్యాసం చేయడానికి సపరివారంగా తరలి వెళ్ళారు.

మంత్రిగారు వెళ్లిన పావుగంటకల్లా ఆనాటి శ్రమదాన కార్యక్రమం ముగిసింది ఎటు వాళ్ళటు వెళ్ళిపోయారు. శ్రీ రావు గారు భూషయ్యతో కలిసి ఇంటికి బయలదేరారు.

తన వెనకే నడుస్తున్న చిన్న జీతగాణ్ణి చూసి "ఏంరా? సుబ్బా! నువ్వింకా ఇక్కడే వున్నావేమిట్రా?" అన్నారు రావుగారు.

"ఎల్తన్నా గదండీ?" అంటూ వేగంగా నడవసాగాడు చినసుబ్బడు.

"ఎడ్లకు దానా పెట్టావా? గేదెకు కుడితి పోశావా!" అన్నాడు తీవ్రంగా జీతగాడి వంక చూస్తూ రావుగారు.

"లేదండీ? ఇప్పుడు పోయి పెట్తాను!" నసిగాడు జీతగాడు.

"ఛ! తప్పుడు వెధవ? ఇంటి దగ్గరుండి పని చూసుకోక నువ్విక్కడి కెందుకొచ్చావురా అసలు?" గద్దించి అడిగాడు యజమాని.

"తమరూ, మంత్రిగోరూ ఏందో దానం చేత్తారంటే సూద్దామని వచ్చానండీ!" అన్నాడు జీతగాడు.

"పోరా! సోమరిపోతా! తొందరగా పోయి ఎడ్లకు గుగ్గిళ్లపెట్టు! దొర మాదిరిగా నడుస్తున్నాడు దొర! ఊం! నడవ్వేరా?" అన్నారు రావుగారు. చేతికర్ర అటూ ఇటూ ఊగిస్తూ.

చిన జీతగాడు పరుగు లంకించుకున్నాడు. వెనక్కు తిరిగి చూడకుండా అదే పరుగుతీశాడు యజమాని ఇంటికి.

—సుబ్బాయికి పదోయేడు రాగానే తండ్రి వాణ్ణి రావుగారి ఇంట్లో పనికి పెట్టాడు. అన్నం, గుడ్డలు యిచ్చి సంవత్సరానికి నాలుగు అంకేలు వడ్లు యిస్తారు. సుబ్బాయి తండ్రి మాపులు రోజుల్లో వచ్చి నాలుగు అంకేలు కొలిపించుకు పోతాడు. ఆ తర్వాత ఎప్పుడో తప్ప కొడుకుని చూట్టానికి కూడా రాడు. ఉల్లిపాలానికి పదిమైళ్ళ దూరంలో వున్న ఒక పల్లెలో సుబ్బాయి తల్లి, తండ్రీ, తోబుట్టువులూ వుంటున్నారు. ఏడూ ఆరు నెలలకి, సంవత్సరానికి ఒకసారి సొంతవూరు వెళ్ళి వస్తుంటాడు కాని సుబ్బాయికి ఉల్లిపాలెమే సొంత వూరుగానూ, రావుగారి ఇల్లే సొంత ఇల్లుగాను వుంటోంది. రెండు సంవత్సరాలుగా రావుగారి ఇంట్లో ఆ పనీ, ఈ పనీ చేస్తూ వున్నాడు. ఇల్లు ఊడవటం, గొడ్లకాడ బాగుచేయడం, గొడ్లను మేపుకు రావడం, యజమానికి నీళ్లు తోడటం, పక్కలు వేయడమూ వాడి దినచర్య.

(ముగింపు వచ్చే సంచికలో)

కమలాకరాన్ని లక్ష్మీపతి అసలు ఎరగనే ఎరగరు.

అందుకే వాళ్ళది ఆదర్శ దాంపత్యం

○ ○ ○

అదే కోట లాంటి యిల్లు.

అదే కోటగుమ్మంలాంటి గేటులోంచి రహదారి పడవలాంటి కారు సన్నగా జారి, పోర్టికోలో ఆగి, లలితంగా పిల్చింది. పిలవడమే తడవుగా "డాడీ" అంటూ అమెరికా ఐశ్వర్యంలాంటి ఓ అబ్బాయి పరుగెత్తుకొచ్చేడు. అక్కడే అందుకే నిరీక్షిస్తోన్న నౌకరు కారు డోరు తీయగా, దాని అధిపతి లక్ష్మీపతి గారి కలలంత నిరాడంబరంగా నిర్మలంగా కారు దిగి, ఎదురొస్తోన్న కొడుకుని ప్రజాస్వామ్య సోషలిజంలా పట్టుకుని రెండడుగులు వేయకముందే ఇరాన్లో విప్లవంలా ఎదురైంది గాయత్రి.

○ ○ ○

అదే నగరం,-అంచులు చించేసి, ఎల్లలు తుడిచేసి విశృంఖలంగా విస్తరించుకుంది నలువైపులకీ, ఆ నగరానికి ఓ చివర పెద్ద ఫేక్టరీ ముందు అడుక్కుంటోంది వయస్సుమళ్ళని ఓ ముసిల్ది. ఎర్రటి పొడవాటి కారు, ఆ ఫేక్టరీ గేటుముందు ఆగగా అందులోని వ్యక్తిని ఆసక్తిగా చూస్తోంది.

"అమ్మా ఆకలే..." అన్నది చెయిపట్టు కున్న బిడ్డ.

అందుకు సమాధానం దొరక్క, కార్పణ్యానికి కన్నీళ్ళు లేక, ప్రజాస్వామ్యంలా పొడిగా ఏడ్చింది ఆ తల్లి. ✱

# శ్రీశ్రీ పదబంధ ప్రహేళిక

ఈ సంచికలో శ్రీశ్రీ గారి పదబంధ ప్రహేళిక ప్రచురించలేకపోతున్నందుకు చింతిస్తున్నాము. శ్రీశ్రీ గారు విదేశాలలో వున్నారు. జనవరి, ఫిబ్రవరి సంచికలలో ప్రచురించిన ప్రహేళికలు శ్రీశ్రీ గారు లండన్‌నుంచి పంపినవే!

ఫిబ్రవరి ప్రహేళిక సమాధానాలూ, విజేతల పేర్లూ యిక్కడ ప్రచురిస్తున్నాము.

—ఎడిటర్

## ఫిబ్రవరి 1981 ప్రహేళిక సమాధానాలు

అడ్డం: 1. జిన, 3. ఓశి, 5. ఉన్నాడు, 6. పంకజం, 8. తిప్ప, 9. మగడు, 11. పస, 13. భారమా, 15. వినతి, 16. నల్లబజారు, 17. విరసం, 19 పునితం. 22. నావ, 23 గిన్నెలు, 25. కాజా, 26. దేవుడు, 28. లులాయం, 30 లాగు, 31. లువి.

నిలువు: 1. జిన్నా, 2. నడుమ, 3. ఓ పండు, 4. తిక, 5. ఉప్పర, 7. జంపన 8. తిఖా, 10. గడబన్నె 12. సతి, 14. మానసం, 15. విరవు, 17. వినా, 18. రవడే 20. నికాయం. 21. తంజా, 23 గొడుగు, 24. లులులు, 27. వులా, 29 లాలి.

## ఫిబ్రవరి '81 విజేతలు

1. ఆర్. కమల, హసన్‌పర్తి. 2. ఎన్. రామశాస్త్రి, వరంగల్ 3 బి ఆర్. కృష్ణమూర్తి, టెక్కలి.

బహుమతి మొత్తం రు 100 విజేతలు ముగ్గురికీ సమానంగా పంచబడుతుంది.



[గత సంచిక తరువాయి]

శ్రీ రావుగారి ఇంట్లో మరో పెద్ద జీతగాడు వుండడంచేత, వాడి పేరూ సుబ్బాయే అవడంచేత చిన్న జీతగాడ్ని రావుగారు "చిన సుబ్బాయి" అనీ, "చిన్నోడా" అని పిలుస్తా వుంటారు.

చిన్న జీతగాణ్ణి ఇంటికి తరిమి, శ్రీ రావుగారు భూషయ్యను వెంటపెట్టుకుని తమ ఇటుక ఆము దగ్గరకు వెళ్లారు. ఇటిక ఆమూ, గుడిశలు కలయతిరిగి పరీక్షిస్తుండగా, ఆము దగ్గర కాపలావాడు చేతులు నలువుకుంటూ వచ్చి రావుగారిముందు నిలబడ్డాడు.

"ఏంరా? అప్పుడే కూలీలంతా వెళ్ళిపోయారా?" అన్నాడు యజమాని.

ఇటిక ఆమునుంచి కాలిబాటన కొంతదూరం నడచి రోడ్డు ఎక్కి ఊరువైపుకు రావుగారు నడుసున్నారు. వెనక భూషయ్య మౌనంగా నడుస్తున్నాడు.

రావుగారికి వళ్ళంతా చిరాగ్గా వుంది. మట్టి, చెమటతో తడిసి చొక్కా మురికిగా వుంది. చల్లటి గాలి ముఖానికి తగలగా రావుగారికి ఆనాటి శ్రమదాన మహోత్సవ సంఘటనలన్నీ ఒక్కొక్కటే కళ్ళముందు తిరగసాగాయి. శ్రమించి పనిచేయడంతో వున్న గౌరవం, ఆత్మతృప్తి రావుగారికి నరనరాన ఎక్కుతోంది.

"భూషయ్యా!" అన్నారు రావుగారు.

"అయ్యా!" అన్నాడు అణకువతో భూషయ్య.

# శ్రీవారి శ్రమదానం

'వస్త్ర'

"ఆఁ! ఇప్పుడేదొరగారు! వెళ్ళిపోయారు?"

"పోతారు! పోతారు! ఒక్కొక్కళ్ళకూ వళ్లు బలిసిపోతూందిరా. ఎవర్ని చూసినా పనికి వళ్లు దాచుకునేవాడే కనబడుతున్నాడేంరా? ఊర పొద్దు కూకలేదు! అప్పుడే వెళ్లిపోయారు!"

"ఇవ్వాళ కొత్తేముందిలే బాబుగారూ! మామూలు వేళకే వెళ్ళారు కూలీలంతా!" అన్నాడు భయం భయంగా.

"మామూలు వేళట! ఒళ్లు కొవ్వెక్కి చస్తున్నారు. రేపట్నుంచి కూలీలంతా తెల్లవారి ఏడుగంటలకు రావాలి! మళ్ళీ రాత్రి ఏడుగంటలదాకా పోవడానికి వీల్లేదని చెప్పు!" అని రావుగారు గిర్రున వెనక్కి తిరిగారు.

"దేశంలో సోమరిపోతులు ఎక్కువయిపోతున్నారు భూషయ్యా!"

"అవునవును!" అని తల ఊగించాడు భూషయ్య. రావుగారి మాటలు అర్థంకానపుడు అవునని తలకాయ ఆడించడం భూషయ్యకు అలవాటు.

"పనంటే ఎవడికి గౌరవం వుంది చెప్పు!"

"అవునండీ! ఎవడికి గౌరవముంది?" ప్రశ్నార్థకం గుర్తులా ముఖం పెట్టాడు భూషయ్య.

"ఆ కూలీలు వున్నారే చూడూ! అంతా వళ్లు దాచుకునే రకమే! పనిలోకి వచ్చిందగ్గర్నుంచీ పొద్దెప్పుడు వాలుతుందా, కూలీ డబ్బులు ఎప్పుడు గుంజుకుపోదామా అన్న

ఆలోచన తప్ప పనిమీద ధ్యాసే లేదుగదా వీళ్ళకు?". రావుగారి పాదరక్షలు రోడ్డుమీద దుమ్ము లేపుతున్నాయి. గాలివాటుకు ఆ దుమ్ము రావుగారి వెనక నడుస్తున్న భూషయ్య ముఖాన్ని తాకిపోతోంది.

"అవును! అవును! యీ రోజుల్లో వళ్ళొంచి పనిచేసే కూలోడెవడండీ! అందుకే గాదు టండీ మనం యీ శ్రమదానోద్యమాన్ని నడపడం?" అంటూ భూషయ్య ముఖం మీదకు వస్తున్న దుమ్మును తప్పుకోవడానికి, రావుగారికి ఒక పక్కగా నడవటానికి ప్రయత్నం చేశాడు.

"ఆఁ! అవును భూషయ్యా! యీ శ్రమదానోద్యమం బాగా ముందుకు పోతే యీ మాలోళ్ళందరికీ బుద్ధొస్తుందనుకుంటా!"

"బుద్ధిరాదుమరి! ఇందాక మట్టిపల్లెక మోస్తున్న మిమ్మల్ని చూచినవాడెవడికైనా బుద్ధొచ్చి తీరాలి! జనం ముక్కుమీద వేలేసుకుని నుంచున్నారంటే నమ్మండి!" అన్నాడు.

రావుగారి హృదయం ఉన్‌లప్ ట్యూబులా ఉబకసాగింది.

"అసలు తేడా అక్కడే వుంది భూషయ్యా! కూలీడబ్బులకోసం పనిచేసేవాడికీ, ఫలితం ఆశించకుండా పనిచేసేవాడికి భేదం అదే! శ్రమదానం చేయటం అంటే ఆ మనిషికి ఒక ఆశయమూ, త్యాగబుద్ధి ఎన్ని వుండాలి మరి! పావలా డబ్బుల కాసించి పనిచేసేవాడికీ, శ్రమను త్యాగం చేసేవాడికీ అసలు పోలికేమిటి భూషయ్యా."

"అంతే! అంతే! అదిసరేగాని మీరు గమనించారో లేదో? మట్టి మోస్తున్నప్పుడు మిమ్మల్ని చూసి మంత్రిగారు చిత్తయిపోయారంటే నమ్మండి! ఈసారి అసెంబ్లీ టికెట్ తమకు ఖాయం." అన్నాడు భూషయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"వెధవది ఎసెంబ్లీ టికట్ ఏమిటి భూషయ్యా! పార్లమెంటుకు పార్టీ టికట్ ఇవ్వమంటే మాత్రం కాదంటారా ఏమిటి?"

"అవునవును! పార్లమెంటేమిటి—" ఆ తర్వాత ఏమనడానికి తోచక భూషయ్య తికమక పడ్డాడు.

రావుగారు భూషయ్య భుజం తట్టుతూ 'బెక బెక' నవ్వేరు. రావుగారు, భూషయ్య వస్తూంటే, వీధి అరుగులమీద కూర్చున్న వాళ్లు రావుగారిపట్ల మర్యాద సూచకంగా లేచి నిలబడ్డారు.

రావుగారు తమ ఇల్లు సమీపించగానే ఆగి "భూషయ్యా! ఇక నువ్వెళ్ళు! ఆఁ! చెప్పటం మరిచాను! రేపు ఉదయం ఒకసారి ఇటిక ఆము దగ్గరకెళ్ళి చూడు! నెలరోజుల్నుంచీ వీళ్ళైపేల ఇటిక కూడా ఎత్తలేకపోయారు?" అన్నాడు.

"రేపట్నుంచీ కూలోళ్లను నడుంమీద తన్ని పనిచేయించనూ! ఈసారి ఇటుక పొరుగూరు తీసుకుపోయి తక్కువ ధరకు అమ్మాల్సిన పనిలేదులేండి! ఇప్పుడున్న ఇటుకంతా దేవాలయం కట్టడానికి సరిపోతుంది! వసూలయిన డబ్బులో సగానికి పైగా మన ఇటుక ఖాతాలోనే జమ! ఇంకేం?"

"సరే? నువ్వెళ్ళిరా!" చిరాగ్గా అంటూ రావుగారు ఇంట్లోకి దారితీశారు.

"మరి! మరి! మీటింగుకు అయిన ఖర్చులూ—" సాగదీసాడు భూషయ్య.

లోపలకు వెళ్తున్న రావుగారు టక్కున ఆగి వెనక్కు తిరిగి భూషయ్య ముఖంలోకి చూశారు.

"ఆఁ! ఆఁ! అదేనండీ! పల్లెలోనుంచి కొంతమందిని రోజుకూలీమీద పిలిపించాంగా!"

"రేపు చూద్దాంలే! ఇప్పుడేం తొందర! అసలు నీకు సమయమూ సందర్భమూ తెలియకుండా పోతూంది!" రుసరుసలాడుతూ అన్నారు రావుగారు.

"ఇటికాం కూలీ ఖర్చులో రాయమంటారా?"

"నీ కన్నీ చెప్పాలయ్యా! ఆ మాత్రం తెలియదూ?" అని విసవిసా లోపలికి వెళ్ళారు రావుగారు.

రావుగారు ఇంటికి చేరేసరికి ఎనిమిది గంటలయింది. వరండాలో వున్న పడక







కుర్చీలో జారగిలబడి—"ఒరే చిన్నోడా?" అని కేక వేశారు. పొయికింద కందికట్టె మంట పెడుతూన్న సుబ్బాయి పరుగెత్తుకువచ్చాడు.

"నీళ్లు కాగినయ్యా" అడిగాడు యజమాని.

"ఆఁ! జాగినయ్ దొరగారు! నీళ్లతోడ మంటారా?" అన్నాడు జీతగాడు.

"తోడుదువుగానిలే! ముందు నువ్వుపోయి మంగల్యాణ్ణి పిలుచుకురా! తలంటి పోసుకోవాలి!"

"ఇప్పుడా అండీ?"

"మరింకెప్పుడనుకొన్నావురా? పో! తొందరగా పోయి మంగల్ని పిలుచుకురా!"

నీళ్ళ కాగుకింద నాలుగు కట్టెలు తోసి చిన్నోడు మంగలి రత్తయ్య ఇంటికి బయలుదేరాడు!

పడక కుర్చీలో అలసిపోయి పడుకొన్న రావుగారికి వళ్ళంతా ఏరగొట్టినట్టుంది! కళ్ళు చింత నిప్పుల్లా మండిపోతున్నాయి. [బాగా వేడి చేసినట్టుంది. మాడు కూడా మంటగా వుంది. "వెధవ పల్లిక!" అనుకొన్నారు రావుగారు.

ఈ పూట వళ్లు పట్టించుకోకపోతే నెప్పులు తగ్గవే! గిన్నెడు ఆవదం తలకూ, అరికాళ్ళకూ అరిచేతులకూ మర్దన చేయించి గంగాళం వేన్నీళ్ళు పోసుకుంటే హాయిగా నిద్రపడుతుంది! కష్టేఫలి అని ఊరికనే అన్నారా పెద్దలు? మహానుభావుడు?

శ్రమదానోద్యమాన్ని కనిపెట్టినందుకు చెప్పుకోవాలి? రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టొచ్చు.

వెనగ్గా వచ్చి నుంచొన్న శ్రీమతి అడుగుల సవ్వడికి రావుగారి ఆలోచన సరిగా కాలని ఇటుకలా విరిగిపోయింది.

"ఏవండీ, మట్టి తెగ మోసేరంట్రగా?" కిలకిల నవ్వుతూ శ్రీమతి అన్నది.

లోలోపల ఆనందిస్తో— "ఎవరు చెప్పారూ!" అన్నారు రావుగారు దీర్ఘం తీసి.

"ఇంకెవరు? మన చిన సుబ్బడు! చెప్పి విరగబడి నవ్వాడు వాడి దుంపతెగ!" అని పకపకా నవ్వింది శ్రీమతి. శ్రీమతి నవ్వులో తనూ కలిసి నవ్వారు రావుగారు.

రొప్పుకుంటూ, రోజుకుంటూ పరుగెత్తుకొచ్చిన చిన జీతగాడ్ని చూసి రావుగారు అన్నారు.

"ఏడిరా? రత్తాయీ?"

"ఇంటి దగ్గర లేడండీ! పొలం పోయాడంట! వాడి పెళ్లాం చెప్పింది!" అన్నాడు చిన సుబ్బాయి.

"అన్నీ దొంగ వేషాలు! వాడు ఇంట్లో వుండే అలా చెప్పించి వుంటాడు. పనంటే సరి! ప్రతివాడు ఏదో వంకపెట్టి తప్పుకుంటాడు!" అంటూ రావుగారు లాల్చీవిప్పి అవతల పారేసి ముక్కాలి పీటమీద కూర్చున్నాడు.

"నీళ్లు తోడమంటారా?" అడిగాడు చిన్నోడు.

"ఆముదం సీసా తీసుకు రారా! నువ్వన్నా అంటుదువుగానీ! ఏం చేసాం మరి ఆ రత్తి ముండా కొడుకుని యీ సారి ఇంటి చాయలరానియ్! పక్కెలు విరగతంతా!" రావుగారికి మంగలి రత్తయ్య మీద వల్లమాలిన కోపం వచ్చింది.


-అసలు మంగలిపని చేసేవాడికి పొలం పనేమిటంట? వాడికి ఆ రెండెకరాలూ మగతాకు ఇవ్వడం తనదే బుద్ధితక్కువ! వచ్చే ఏడు పొలం అంతా తాను స్వయంగా చేయించుకొంటాడు. లేకపోతే ఈ కౌలుదారీ బిల్లూ-యీ గొడవలూ తను పడలేడా? చేయగలిగినంతా తనే స్వయంగా చేయించుకొనేది మిగతా పనికిరాని దేమన్నా వుంటే భూదానం చేస్తే సరిపోతుంది! కీర్తికి కీర్తి దక్కుతుంది. కౌలుదార్ల పీడా విరగడై పోతుంది. నిన్నటి శ్రమదానంతో తనకి తెలిసింది, పని చేయడం ఎంత తేలికో! ఆలోచిస్తూ పీటమీద కూర్చున్న రావుగారు జీతగాడు ఆముదం సీసా తీసుకుని పక్కన నుంచున్నదే గమనించలేదు.

"దొరగారూ! నూనెకాయ తెచ్చా" అన్నాడు జీతగాడు.

"ఊఁ తెస్తే చూస్తా నుంచుంటావేంరా? అంటూ!" అన్నాడు.

సుబ్బాయి చేతినిండా ఆముదం తీసుకొని రావుగారి నెత్తిన రుద్దటం మొదలు పెట్టాడు. ఎంతసేపు రుద్దినా చాలనకుండా తాపీగా కూర్చున్నాడు యజమాని. సుబ్బాయికి






కొంచెం సేపటికి చేతులు పచ్చుబడ్డాయి. పైగా వాడికి అలవాటులేని పనాయె.

"ఊ! గట్టిగా రుద్దరా గాడిదా!" కళ్ళ మీదకు కారుతూన్న నూనె తుడుచుకొంటూ అన్నారు రావుగారు.

వంట్లో సతువంతా చేతుల్లోకి తెచ్చుకొని తపతపా అంటుతున్నాడు సుబ్బాయి.

"ఆ! ఆహా! హాఁ! అంటూ కళ్ళు అర మూతలు వేసి కూర్చున్నాడు రావుగారు.

సుబ్బాయికి అరి చేతులు మంట లెక్కుతున్నాయి. విపరీతపగా అలుపు వస్తుంది. వళ్ళంతా చెమటలు పట్టిపోతోంది కుర్రాడికి.

"ఊ! చాల్లే! మంచినూనె తీసుకొని వంటికి మర్దన చెయ్యరా!" అంటూ మొల పంచె మోకాళ్ళ మీదకి లాక్కున్నారు రావుగారు.

యజమాని వంటికి సుబ్బాయి మంచినూనె మర్దనం చేయసాగాడు. ఆ పసివాడి చేతులకు యజమాని శరీరం చిన్నగున్న ఏనుగు పరిమాణాన తగులుతూంది.

దాదాపు అరడుగుల పొడుగు మనిషి, కండలు తిరిగిన శరీరం, అరటి స్తంభాల్లావున్న రావుగారి చేతుల మీదా, కాళ్ళమీద సుబ్బాయి సన్ననివేళ్ళు బలహీనంగా పాకుతున్నాయి.

"ముప్పూటా పెద్ద గిన్నెడు అన్నం తింటావే! సత్తువలేదేరా? ఊ! గట్టిగా రుద్దు! ఆ నూనంతా వంట్లో యింకి పోవాలి! రుద్దు!" గదమాయించాడు యజమాని.

"చేతులు నొప్పెడుతున్నాయండీ?" అన్నాడు బిక్కమొఖం వేసి చిన్నోడు.

"పుట్టాయిరా? పుట్టాయి! పూటకు సోలెడు బియ్యపన్నం తినడానికి చేతులు నొప్పులు పట్టవేం?"

"చంకలో గడ్డ లేచిందండీ! నొప్పిగా వుంది!" ఏడుపు గొంతుతో అన్నాడు చిన్నోడు.

"ఒరే! యీ దొంగ మాటలు ఎప్పట్నుంచి నేర్చుకున్నావురా? రోజూ తెగతిని పడుకో మరిగిన నీకు యివ్వాళ వళ్ళొంగమంటే వంగుతుందా? ఊఁ! మోకాళ్ళ మీద. మడేల మీద గట్టిగా రుద్దూ!" అన్నారు రావుగారు.

కిక్కురుమనకుండా చేతినిండా నూనె పోసుకుని యజమాని మోకాళ్ళమీద సత్తువ

# ఏది ముఖ్యం?

జీవితంలో మానవులు ఎంతకాలం జీవించారు? అనేది ముఖ్యం కాదుగాని వారు ఎలా జీవించారు అనేది చాలా ముఖ్యం. జీవితానికి పొడవు మాత్రం వున్నా ప్రయోజనం లేదు. వెడల్పుకూడా వుండాలి. తినటంలో, త్రాగటలో మితముగా నుండి దేహానికి హాని కలిగించే త్రాగుడు, వ్యభిచారం, నల్లమందు, పొగాకు. మత్తుమందు ఇలాటి అలవాట్లకు దూరంగా నివసించే వ్యక్తికి దీర్ఘాయువు గల జీవితం మట్టుకే కాకుండా అతని జీవితం ఆనందంతో నిండివుంటుదని చెప్పటకు సందేహం లేదు. యాభై సంవత్సరములు దాటిన తరువాత నీవు ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలనుకొంటే ఆ యభై సంవత్సరాలకు ముందు నీ జీవితములోని ఆహారం, పానీయం, ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించటం ఎంతైనా అవసరం. ఏదైన అతిగా చేయుటవలన ఆరోగ్యము దెబ్బతింటుంది మన ఆలోచనల్లో, ఆహారంలో, పాటల్లో, మాటల్లో, పనుల్లో మితంగా ఉండటం మానసిక ఆరోగ్యానికి, దైహిక ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడుతుంది.


వృద్ధాప్యం ఆవరించడానికి కాలంతో ప్రమేయం లేదు. దైహిక వృద్ధాప్యము ఆలస్యముగా వచ్చినా మానసిక వృద్ధాప్యము కొంతమందికి చాలా త్వరగానే వచ్చేస్తుంది. మనోవేదన, భవిష్యత్తు గూర్చిన భయాలు, హృదయంనిండా నింపుకొన్న ద్వేషాలు, అసూయలు, నిరాశలు మానవులు ఏ వయస్సులో నున్నా అవి వారి ఆత్మానికే ముతతలు కలుగచేసాయి. కొంతమందికి లోకమంతా చెడుగులోనే నిండియుంటుందనే నమ్మకం. అందులో వారొక్కరే సత్పురుషులు అనే భావంతో అందరిని ద్వేషించటం, అనుమానించటం అలవరచుకొంటారు. ఇలాంటివారికికూడ వృద్ధాప్యము త్వరలోనే వస్తుంది.

ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, ఇలాటి దైవగుణములకు హృదయము నిండా నింపుకొని వారి జీవితలోకూడా అలవరచుకొన్నవారు కాలక్రమానుసారంగా వచ్చే వయస్సులో ముసలివారుగా కన్పించకుండా దీర్ఘకాలం యౌవనులుగానే కనిపిస్తూవుంటారు. అసహనం, అనుమానం, అసంతృప్తి, ఆవేశం వీటితో మనస్సును నింపుకొంటే వృద్ధాప్యం ఆవరించుటకు క్షణం కూడ పట్టదు. మానవుడు చెడుగుమీద తన హృదయాలోచనలను ఏ క్షణంలో కేంద్రీకరిస్తాడో అపుడే మరణాన్ని కలిగించే విషఫలములు ఫలించుటకు మొదలౌతాయి. మానవ దేహమనే ఈ ఆలయానికి మరామతు అప్పుడప్పుడు అవసరమేగాని తగిన గాలి వెలుగు ధారాళంగా ప్రవేశిస్తుంటే ఆ ఆలయం ఆరోగ్యకరంగా ఉంటుంది. బాల్యంలో ఇన్‌ఫెంటాయిల్ పెరాల్‌సిస్ అనే వ్యాధికి గురియై చేతికర్రలతో నడుస్తున్న విద్యార్థిని ప్రశ్నించాను. ఇంత నిర్వికారంగా, ఇంత ఆనందంగా, ఇంత స్నేహపరుడుగా వుంటూ ఇంత ఉన్నతమైన విద్యను ఈ వికారమైన అవిటికాళ్ళతో ఎలా సాధించావని ప్రశ్నించాను. "ఆ వ్యాధి నాహృదయాన్ని ఎన్నడూ తాకలేదని" ఆయన బదులిచ్చాడు. వ్యాధులు, బాధలు, కష్టాలు, కన్నీళ్లు మానవ జీవితంలోని ఒక భాగము. వీటిని ఎవ్వరుకూడ తప్పించుకొనలేరు వర్షం వర్షింపకుండ ఆపగలిగేవారు ఎవరున్నారు. అయితే క్రీస్తు బిడ్డలు వర్షంలోకూడ హర్షించగలరు. ఆ క్రీస్తును గూర్చి తెలుసుకొన్నారా?

—శ్రీమతి చదలవాడ చంద్రమతీదేవి.


| ఉచితం ! | ఉచితం ! |
| --- | --- |
| దైవస్వరూపుని దివ్యచరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలుచుకుంటే మీ చిరునామా ఈ రోజే మాకు వ్రాయండి. పోస్టుఖర్చులు మేమే భరించి ఉచితంగా మీకు పుస్తకం పంపుతాము. | డా॥ ఎన్. జాన్ డేవిడ్, డి.డి.<br>ఫార్‌కార్నర్స్,<br>పోస్టుబాక్సు నెం. 14<br>చిలకలూరిపేట<br>గుంటూరు జిల్లా. |

GOSPEL MESSAGE INSERTED BY FARCORNERS


కొద్దీ రుద్దడం మొదలు పెట్టాడు సుబ్బాయి.

మోకాళ్ళు రుద్దించుకుంటూంటే రావుగారికి హాయిగా వుంది. దివ్యమైన వూహలు మెదడులో అల్లీబిల్లీ తిరగసాగాయి.

ఆ రోజు తను చేసిన శ్రమదానం ఆ కూలీ ముండాకొడుకులు ఎవరైనా చేయగలరా? తను ఎంత బాధపడి వంగని మోకాళ్ళను బలవంతంగా వంచి బలవంతంగా మట్టిపల్లలు తలకెత్తుతున్నాడు? ఎన్నిసార్లు మట్టి మోశాడు? ఆ మాటకొస్తే ఎక్కువ మట్టి మోసింది నేనేనేమో? తన వయసులో ఆ పని, అందునా అలవాటులేని ఆ మట్టి పని ఎప్పుడు చేయగలుగుతాడు? తనకు పనిలో గౌరవమూ, ఆత్మ విశ్వాసమూ ఉండబట్టే అంతపని తను చేయగలిగాడు. అంతగా కష్టపడబట్టే తన మోకాళ్ళు ఇంతగా పట్టుకుపోయాయి. సమయానికి అందరతాయి గాడేమో ఎగగొట్టాడు. యీ కుర్రనేన్నా సేమో ఊరికే చేతులాడించటం తప్ప వంటికి ఆనేట్టు రుద్ది ఏడవలేకపోతున్నారు.

చిన్నాడి ముఖమంతా చిరచెమటలు కమ్మింది, నోరు తెరిచి గాలి పీలుస్తున్నాడు. చేతులు వంగడంలేదు. రుద్దీరుద్దీ అలసిపోయాడు. కళ్ళు బైర్లు కమ్ముతున్నట్టయింది! తన చేతులు ఎక్కడ వున్నాయో, ఏం చేస్తున్నాయో వాడి మనసుకి తెలియడం లేదు. యంత్రంలా తన చిన్న చేతుల్ని రావుగారి శరీరం మీద పైకీ కిందకీ ఆడిస్తున్నాడు.

"ఒరేయ్ సుబ్బా! నువ్వు వళ్ళు పట్టడం ఏడ్చినట్టే వుందిగాని ఇక ఆపు. కాస్త వేన్నీళ్ళు లాగిపోయి వేడినీళ్లు బయటపెట్టు!" అని కాళ్లు చాచి పాదాలు సుబ్బాయి ముందు పెట్టారు రావుగారు.

రావుగారు స్నానానికి కూర్చున్నారు. శ్రీమతి తల అంటుతూంటే సుబ్బాయి కుంకుడు రసం పోశాడు. తర్వాత సుబ్బాయే వీపు అవీ రుద్దాడు. మూడు కాగుల వేడినీళ్ల పోసుకొని రావుగారు స్నానం పూర్తిచేశారు.

రావుగారు భోజనం చేసి వచ్చేసరికి సుబ్బాయి పక్కవేసి మంచందగ్గర మంచినీళ్ళ, పొగాకు కట్టా, అగ్గిపెట్టె సిద్ధంగా వుంచాడు.

రావుగారు మంచంమీద కూర్చొని చుట్టవున తేసి చుట్ట వెలిగించారు.

చుట్ట దమ్ములాగి పొగ వదులుతూ మధ్య మధ్య ఖాండ్రించి ఊస్తూ కూర్చున్న రావుగారికి పొలానవున్న పెద్ద జీతగాడు గుర్తుకొచ్చాడు.

పెద్ద జీతగాడు ఉదయం అన్నం తినిపోయి తూర్పు పొలాన నారుమడిదగ్గర కాపలా వున్నాడు. రేపోమాపో కాలవ వదలతారని తెలిసి జీతగాణ్ణి పొలాన్నే రాత్రుళ్ళు కూడా వుండమని చెప్పారు వాడికి అన్నం పంపే సంగతి ఇంతవరకూ తనకు జ్ఞాపకమే రాలేదు సుమా! వాడు ఇంకొంచెం ఆలస్యమయితే నారుమడి వదిలేసి ఇంటికి వచ్చేరకం! వట్టి తిండిపోతువెధవ! ఒక్కపూట తిండి తక్కువయితే వాడుండలేడు.

"ఒరే సుబ్బా! ఏం చేస్తున్నావురా? ఇట్లారా?" అని బిగ్గరగా పిలిచారు రావుగారు.

కడిగి తెచ్చుకొంటూన్న గిన్నె చావిట్లో పెట్టి యజమాని దగ్గరకొచ్చి నిలబడ్డాడు సుబ్బాయి.

"ఏంటి దొరగారు"? అన్నాడు సుబ్బాయి.

"ఏం చేస్తున్నావ్‌రా?" ఆప్యాయంగా అడిగాడు యజమాని.

"అన్నం తినబోతున్నానండీ" అన్నాడు సుబ్బాయి.

"తర్వాత తిందువుగానీ, తూర్పు పొలం పోయి పెద్ద సుబ్బడికి అన్నం యిచ్చిరా ముందు."

చిన్నోడికి నోట పెగల్లేదు! మౌనంగా నుంచున్నాడు.

"ఏం రా? మొద్దులా నుంచున్నావే? పోయి వాడికి అన్నం యిచ్చిరా! మళ్ళొచ్చి తిందువుగానిలే నువ్వు!" అని రావుగారు భార్యను పిలిచి అన్నం మూటకట్టి యివ్వమని చెప్పారు.

"ముందు పిల్లాణ్ణి తిననీయండి! చిన్నసన్నాసి పాపం! తర్వాత తీసుకు వెళ్తాడులే వాడికి అన్నం! పెద్దాడికి వాడికేం రోగమా?" చిన్న జీతగాణ్ని వెనకేసుకొచ్చి అన్నది రావుగారి భార్య.

"మహా చెప్పావు లేద్దూ! నీ మాత్రం నాకు తెలియదంటావా? వీడు అన్నం తినిపోయే లోపల వాడిక్కడకు రానే వస్తాడు! నారు మడి దగ్గర మనిషి లేకపోతే కాలవకు నీళ్ళొచ్చే రోజుల్లో యింకేమయినా వుందా? ముందు అన్నం మూట గట్టియ్ వాడికి!" అని చుట్ట అవతల పారేసి దోసకాయ చెంబెడు నీళ్ళు గడగడ తాగాడు రావుగారు. రావుగారి భార్య అన్నం మూట తెచ్చి సుబ్బాయి చేతికిచ్చింది. మూటభుజాన వేసుకొని సుబ్బాయి దీనంగా యజమానికేసి చూశాడు.

"చిన్నోడా! ఇంకెందురా ఆలస్యం? అడ్డ దారిన వెళ్ళావంటే అరగంట కూడా పట్టదు! ఎంత దూరం రా మన తూరుపొలం! ఊ! చప్పున పోయిరా!"

సుబ్బాయి తటపటాయిస్తూ వదలడం చూసి మళ్ళీ అన్నారు రావుగారు—


"ఇదిగో! ఏమేవ్! సుబ్బాయి పొలం నుంచి రాగానే యివ్వాళ పెరుగేసి అన్నం పెట్టు!"

"పెరుగు అన్నం" మాటవినగానే సుబ్బాయికి కొత్త ఉత్సాహం వచ్చింది. రోజూ సాయంకాలం పులి మజ్జిగ తాగే వాడి జిహ్వకు తియ్యటి పెరుగు తాలూకు రుచులు మధురానుభూతులు కలుగజేశాయి. ఉన్నపాటున సుబ్బాయి అన్నం మూట భుజాన వేసుకొని పరుగు లంకించుకున్నాడు.

అలా ఉత్సాహంతో పరుగెత్తి పోతూన్న చిన జీతగాణ్ణి చూసి రావుగారు సంతృప్తి పడ్డారు. వారి పెదవులపై కదలిన మందహాసం మీసాలమధ్య చిక్కుకుని బయటికి రాలేక పోయింది.

చిన్నోడు లేడిలా, తాచులా పరుగెడుతున్నాడు. కాళ్ల భూమ్మీద ఆనీ ఆనకుండా లేచి పడుతున్నాయి, యజమాని ఇల్లూ-గ్రామ చావడీ-శిథిల దేవాలయం-శ్రీవారు శ్రమదానం చేసిన చరిత్రాత్మక స్థలమూ, యజమాని ఇటిక ఆవము వరుసగా దాటిపోయినై.

-సుబ్బాయి ఊరుదాటి, పొలిమేర దాటి-



రోడ్డు దిగి కాలిబాటన పరుగులు తీసున్నాడు.

సుబ్బాయికి బాల్యం వీడీవీడని వయస్సూ, తెలిసీ తెలియని ఊహలూ, చాలీచాలని తిండీ, ఉన్నా లేని అపులూ-పాపం పన్నెండేళ్ళ సుబ్బాయి అన్నం మూట భుజాన వేసుకొని వెలే కడ ఫృతో ఒంటరిగా రాత్రిపూట బిక్కు-బిక్కు మంటూ చెట్టు దాటీ గట్టు దూకీ, చేలకు అడ్డంపడి ఉరకలు తీస్తున్నాడు. వాడి గుండెల్లో భయం ఓతుకబిఒకు మంటోంది వాడు పరుగెత్తటానికి కారణం సగం భయమే! ఊళ్ళోనుంచి దూరంగా కుక్కల మొరుగు వినపడుతోంది. పొలాలమీదనుంచి నక్కల ఏడుపు వినపడినప్పుడల్లా చిన్నోడికి గుండెలు అలసిపోతున్నాయి.

ఏటి గాలి రయిన విసురుగా వస్తోంది. సీటి మబ్బులు చంద్రుడ్ని తరిమితరిమి కొడు న్నాయి. చీకటి వెలుగుల దోబూచులాటలో, గచ పొదల కీచు శబ్దంతో, హోరుగాలికో వేగంగా-శరవేగంగా పరుగులు తీస్తోన్న చిన్నోడి హృదయంలో ఎంత భయాలు విష సర్పాలై బుసలు కొట్టగా, ఏవేవో పిన్నెన్నో భ్రమలు రాబందుల రెక్కల సవ్వడిలా వాడి బుర్రలో కలిలేచి పడుతున్నాయి.

"అమ్మోవ్!" బిగ్గరగా వెర్రిగా అరచి తక్కిన నిలబడిపోయాడు సుబ్బాయి.

కళ్ళు, రెండు చేతులతో గట్టిగా మూసుకు నిలబడ్డాడు! కాళ్లు గజగజా వణుకుతున్నాయి. పాదాలకు భూమ్మీద పట్టుతప్పి పోతున్నట్ల యింది!

చిన్నాడి చెవులు చిన్నోణ్ణి మోసం చేశాయి. వాడికళ్ళు వాట్టే మోసం చేశాయి, వాడి స్మృతి వాణ్ణి మోసం చేసింది

కళ్ళు చెదిరాయి——

"ఎంత స్వరూపం' భయంకర ఆకారం! తాటిచెట్టంత పెద్దది!"

చెవులు భ్రమించాయి.

గలగల శబ్దం! గాజుల శబ్దం? లంబాడీ గాజుల శబ్దం!! పెనకాలవ కట్టకు అల్లంత దూరంలో ఒక రావిచెట్టూ, రావిచెట్టు కింద ఒక సమాధి——ఆ సమాధిలో నుంచీ-ఆ ఆకారం ఆ శబ్దమూ——సుబ్బాయి లేత మనస్సుతో హత్తుకుపోయిన గాథ

* * * *

అది చిన సుబ్బాయికి పెద సుబ్బాయి చెప్పిన కథ——

ఒకరోజు రాత్రి చిన సుబ్బాయి పెద సుబ్బాయి శ్రీవారి గొడ్ల చావిట్లో పడు కొన్నారు రోజూ మామూలుగా చెప్పినట్లే, పెద సుబ్బాయి పేదరాశి పెద్దమ్మా, రాజ కుమారుడూ, మంత్రి కుమారుడూ కథ చెపు తూ టే "ఊఁ" కొట్టూన్న చినసుబ్బాయి వుండీ వుండీ అన్నాడు గదా——"ఒరే పెద సుబ్బా? పెద సుబ్బా! నువ్వెప్పుడైనా దయ్యాన్ని చూశావంటారా?"

"ఓ! సూశా-షరా సూశానా! సూట్టం సూట్టం లంబాడీ దయ్యాన్నే చూశాన్రా సిన్నోడా!" అన్నారు పెద సుబ్బాయి

"ఎలవ కట్టుంది సూశావా? ఆడోరాయి సెట్టు ది సూశావా? ఆ సెట్టుకిందో సమా దుంది సూశావా? అదుగల్లదా సమాదిలో వుందిరా లంబాడీ దెయ్యం! అన్నాడు పెద సుబ్బాయి.

"నిజంగానా?" ఇంత తకళ్లు చేసుకొని అడిగాడు సిన్నోడు.


"నిజమేందిరా, నిజం? ముమ్మాటికీ నిజ మైతేనూ? అన్నాడు పెద్దోడు.

"ఆ దెయ్యం ఆడెందుకుందీ? ఏంది సంగతి?" అన్నాడు చిన్నోడు పెద్దోడికి దగ్గ రగా జరుగుతూ.

బీడీ ముట్టించి పెద్దోడు చెప్పటం మొదలు పెట్టాడు.

"ఇది మా తాత నాకు సెప్పాడు. అప్పుడు నేనూ నీయంత వుదేవాణ్నంటరా! అప్పుడు సెప్పాడ్రా మా తాత నాకు దీని కత! మన యజమానయ్య తాత, మా తాతకు బాగా ఎరిక ట! అప్పుడు మా తాత ఆయన కంటే కూస్త సిన్నోడట్రే! మన యజమాని తాత ఎంకయ్య మా గొప్ప పెద్దమనిసంట!






అప్పుడు ఎంకయ్యకు మా తాతకు మల్లేనే సెంటు పొలం లేదంట! ఇప్పుడు మన ఆసామి పొలాలున్నసోట పెద్ద సిట్టడవుండేదంటరా, ఎంకయ్యేమో అడవిలో పుల్లా పుడుగు కొట్టు కొని బతుకుతూండేవాడంటరా, మాతాతోళ్ళకు మల్లేనే!" పెదసుబ్బాయి బీడి దమ్ముపట్టటానికి ఆగాడు

చినసుబ్బాయి "ఊ" కొట్టూ వింటున్నాడు.

"ఇట్టావుడగా, ఓ రోజున ఊళ్ళోకి ఓ లంబాడి తండా వచ్చిందిరా! అళ్లు పొలిమేర్లో గుడిసె లేసుకొని ఉండారు. రోజూ ఆళ్ల దగ్గ రికి ఎల్లెసా ఎంకయ్య లంబాడోళ్ల తండాతో సక్యెం సేసుకొన్నాడ్రా! ఓ రోజున ఆల మందల తోలుకని అరణ్యంలోకి లంబాడోళ్లు ఎల్లగానే పెద్ద గాలోనొచ్చింది! గుడిసెల దగ్గర ఒక ముసిల్దాన్ని కాపలా పెట్టి అడాళ్ళు మగాళ్ళు అంతా పనిమీద ఎల్లిపోయారు. ముసిల్దొక్కతీ గుడిశలో కూకుంది! ఉయ్ ఉయ్‌న గాలోన ఇసరూంది. ముసల్ది గుడిసెలో ఒమూల గొయ్యిమీద కూకుంది. తండాలోళ్ళు, ఆళ్లదగ్గరున్న వరాలన్నీ సంచుల్లో ఏసి కట్టి, సంచులన్నీ గుడిసెలో గొయ్యితీసి పాతపెట్టారంట ఓరికి తెలవ కుండాను. ఆ గొయ్యిమీదే ముసల్ది కూకుని కాపలా కాత్తుందన్నమాట! ఇది ఇట్టు ఉగా, ఏడ్నుంచి వచ్చాడో సర్రున ఎంకయ్య ముసల్ది కూకున్న గదిలో కొచ్చాడు లంబాడోళ్ళతో సక్యెం సేత్తున్నట్టు సేసి అప్పు డబ్బు దాసు కొన్నట్టు పసిగట్టేడ్రా ఎంకయ్య! ఎట్టా కని పెట్టేశాడో గాని!

"రావటం రావటం ఎంకయ్య ముసలమ్మ మీదకు దూకి, దాని గొంతుపిసికి సంపేశాడు! సంపేసి, ముసల్దాన్ని పక్కకు లాగి గొయ్యి తీసి ఆడున్న వరాల సంచులన్నీ తీసు కొన్నాడు! పోతూ పోతూ ఎంకయ్య ముస లమ్మను ఆ గోతిలోకే తోసి పైన మట్టికప్పి ఎల్లిపోయాడట!"

"ఆళ్ళోళ్ళు వచ్చేదాక ముసలమ్మ ఆ గోతి లోనే కూకుందా?" అన్నాడు చిన్నోడు.

"ఇంకేట ముసలమ్మరా సచ్చి కూకుంటేను! గాలోన ఎలవగానే లంబాడోళ్ళు వచ్చి సూసు కుందురుగందా, వరాల సంచీలన్నీ మాయ

మయి పోయినై! సంచీలున్న చోట్లో ముసలమ్మ పీనుగు కూకోని ఉంది! తబ్బిసంచులు తీసుకొని ఎంకయ్య పరారి అయిపోయాడు. లంబాడోళ్ళు గోడుగోడున ఏడుస్తూ ఊరొదిలి పెట్టి ఎల్లిపోయారు. లంబాడి తండా ఎల్లిపోయిన కొంతకాలానికి ఎంకయ్య ఊళ్లోకి తిరిగొచ్చాడు. పెద్ద ఇల్లు కట్టి. సూపుకానిన మట్టుకు సిట్టడవి సొంతం సేసుకొని, ఏమీలేని ఎంకయ్య, మారాజు ఎంకయ్య అయిపోయాడంటర! ఇప్పుడు మన ఆసామి వుంటూన్న ఇల్లూ, అరి భూమీ అంతా ఆళ్ళ తాత ఎంకయ్య సంపాయించిందేనంటరాసినోడా!"

"మరి లంబాడీ దెయ్యమో?" చిన సుబ్బాయి మధ్యలో అందుకొని అన్నాడు.

"ఉండ్రా! తొందర పడుతున్నావేం సెప్పుతున్నాగా? ఎంకయ్య పాతేసిన ముసిల్ది లంబాడి దెయ్యం అయి ఎంకయ్య పెళ్ళాన్ని, ఊళ్ళో వాళ్ళను పట్టుకొని ఏడిపిచటం మొదలు పెట్టింది అంట. వంతుస ఎంకయ్య అదిరిపోయి మంత్రగాళ్ళను పిలిపిచ్చి లంబాడి దెయ్యాన్ని సీసాలోకి ఎక్కించి రావిచెట్టు కింద భూస్థాపితం చేయించాడంట! ఎందుకైనా మంచిదని ఎంకయ్య ఆ రావిచెట్టుకింద సమాధి కట్టించి ఏటేటా లంబాడి దెయ్యానికి పూజలు చెయించాడని మా తాత సెప్పాడురా! ఎంత సేసినా, దాని సిగదరగా దెయ్యం అప్పుడప్పుడు రావి చెట్టుకింద సమాదిమీద లేచి నుంచుని సిందులేస్తా వుంటదంటరా?"

పెద సుబ్బాయి బీడి ముక్క అవతల పారేసి చెప్పసాగాడు-

"సిరుడొక రోజున నాన పొద్దుపోయి తూరుప్పొలాన్నుంచి తిరిగి వత్తావుంటే కాలవ కట్ట పక్కన రావిసెట్టుకింద-అబ్బో ఏం సెప్పేదిరా సిన్నోడా? తాటిపమానాన లంబాడి దెయ్యం జుట్టు ఇరపోసుకొని గల గలా-గల గలా—"

కెవ్వున కేకేసి తత్తరపోయి చిన సుబ్బాయి, పెద సుబ్బాయిని వాటేసుకొన్నాడు.

"ఓరి పిరికి నాయాలగదరా! ధడుసుకొన్నావేందిరా? ధైర్యంగా నుంచొని లంబాడి దెయ్యాన్ని నిప్పడిగితే అదే పరుగెత్తదిరా చిన్నోడా?" అని చిన్నోడి వీపు తట్టి చెప్పాడు పెద్ద జీతగాడు.

కాని చినసుబ్బాయి కళ్ళముందు లంబాడి దెయ్యం కదులుతూన్నట్టుగానే వుంది. కళ్ళు గట్టిగా మూసుకొని పెద్దోడి పక్కలో ఆనుకొని పడుకొన్నాడు

* * * *

చిన సుబ్బాయి గట్టిగా కళ్లు నలుపుకొని చూశాడు. దూరంగా కాలవకట్టా-కట్టమీద తుమ్మచెట్టూ-చెట్టుకింద మసక మసకగా కనబడుతోన్న సమాధి—

చిన్నోడికి కాళ్ళు భూమిలో పాతుకుపోయినట్టుగా వుంది. బలవంతంగా కాళ్ళు కదిలించాడు. బొల్లిగా కాలవకేసి నడుస్తున్నాడు.

తను ధైర్యంగా ఉండాలి. ధైర్యంగా వున్నోళ్ళని దెయ్యం ఏమీ చెయ్యలేదట! ఈసారి కనపడితే నిప్పడుగుతాను, దాని సిగ కోసి చేతులో పెట్టుకుంటే సరి! దాని తిక్క కుదురుతుంది చిన్నోడు తనకు తానే ధైర్యం చెప్పుకొంటున్నాడు. లోపల్నించి అజ్ఞాత శక్తులేవో భయాన్ని తెరలు తెరలుగా చిన్నోడి గుండెల్లో విసురుతున్నాయి.

తను పరుగెత్తకూడదు! పరుగెత్తితే దయ్యం తను భయపడి పారిపోతున్నాడనుకుని వెంటపడుతుంది-అలా ఆలోచిస్తూ వెనక్కి తిరిగి చూసుకొన్నాడు చిన్నోడు. ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తోన్నాడు. భుజం మీద అన్నంమూట బరువు తగులుతూంది. మనసులో గుబులూ, భయమూ గూడు కట్టుకుంటూంది. పైకి బింకంగా రొమ్ము విరుచుకొని నడుస్తున్నాడు ఉషారుగా, సరదాగా. ధైర్యంగా శూరాధి శూరుడులా ఉండాలి తను! సన్నగా కూనిరాగాలు తీయడం మొదలుపెట్టాడు. లోపల భయం పెరుగుతూంటే చిన్నోడి గొంతు పెద్దదవుతూంది. గొంతు విప్పి పాడసాగాడు.

"నాయుడోళ్ళింటికాడ నల్లతుమ్మచెట్టు కింద-
నల్లతుమ్మ చెట్టు కింద-
నాయుడేమన్నాడే బుల్లే?
నాయుడేమన్నాడే బుల్లె!"

చిన్నోడు రెండు చేతులు జోడించి రావి చెట్టుకేసి చూస్తో మనసులో దెయ్యాన్ని బతిమాలుకొన్నాడు.

రయిన వీచే ఏటిగాలి హోరులో, తుమ్మ చెట్ల గచ్చపొదల కీచు ధ్వనుల్లో చిన్నోడి గొంతు కలిపి పాడుతున్నాడు.

కొద్ది క్షణాల్లోనే చిన్నోడి గొంతు ఎండిపోయింది. పాట గొంతులోనే కొట్టుకోవడం తప్ప బయటికి రావడం లేదు—

ఉప్పెన నాటి రాత్రి సముద్రం పొంగులా చిన్నోడి గుండెల్లో భయం ఉబుకుతూ వుంది. సిమెంట్ రోడ్డుమీద శ్రీవారి బండి గుర్రం డెక్కల చప్పుడులా చిన్నోడి లేత మనసులో భయం కొలిపే వింత ధ్వనులు లయ యుక్తంగా మోగుతున్నాయి.

చిన్నోడు రెండు చేతులు జోడించి రావి చెట్టుకేసి చూస్తూ మనసులో దెయ్యాన్ని బతిమాలుకొన్నాడు.

"-ఓ లంబాడి దెయ్యమా! కాదు కాదు! దెయ్యంగారూ. నా జోలికి రావొద్దు; నిన్ను చంపింది మా తాతగాదు, మా యజమాని తాత ఎంకయ్య; నీ డబ్బంతా వాళ్ళ దగ్గరే వుంది! కావాలంటే ఆసామిని విరుచుకొని తిను! నేను చిన్నోణ్ణి! నన్నేం చేయమాక! నీకు చిన్నోణ్ణే కావాలంటే ఆసామి కొడుకున్నాడు! వాడూ నా యీడువాడే! వాడ్నే తిను! నీకు ఇంకా కావాలంటే పొలాన వున్నాడు, పెదసుబ్బాయి ఆడ్ని కూడా తినేయ్; నన్ను మాత్రం వదిలేయ్; నీకు రేపు మూడు కొబ్బరికాయలు కొడ్తాను."

దెయ్యాన్ని ప్రార్థిస్తూ, ప్రాధేయపడుతూ మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ చిన్నోడు తూరుప్పొలంవైపు నడుస్తున్నాడు. అన్నంమూట భుజంమీదగా తిరిగి వీపుమీద వేలాడుతూ వుంది.

-అన్నంమూట అక్కడ పారేసి ఇంటికి తిరిగి పోతే? యజమాని అన్నం ఇచ్చి వచ్చావురా అని అడిగితే? ఏం? ఇచ్చొచ్చానని అబద్ధం ఆడేస్తాను! అమ్మో! తెల్లారి పెద సుబ్బాయి పొలాన్నుంచి వచ్చి చిన్నోడు అన్నం తేలేదని చెప్తే? ఇంకా తను బతుకుతాడా? వొళ్ళు పంబరేగదూ! తన రక్తం కళ్ళ చూడడూ?

-తను అయ్యదగ్గరికి పారిపోతేనో? అయ్య మాత్రం ఊరుకోంటాడా? తన్నుకొంటూ తీసుకొచ్చి యజమానికి అప్పచెప్పడూ? ఎటన్నా పారిపోతే?

-అయినా, ఇంకెంతదూరంలే! కాలవ దగ్గర కొచ్చేస్తూంది. కాలవ దాటాడంటే ఒక్క పరుగులో వెళ్ళి సుబ్బాయిదగ్గర పడొచ్చు; యీ రాత్రి ఆడిదగ్గరే పడుకొని తెల్లారి ఆడితో పాటు ఇంటికొస్తే సరి! తను ఇంకా అన్నం తినలేదుగా? కడుపులో పేగులు మెలితిరిగి పోతున్నాయి. ఆఁ! పెదసుబ్బాయి నడిగితే సరి! ఆడి అన్నంలోనుంచి కాస్త పెడాడ్లే! ఆడు చాలా మంచాడు! ఆడికీ మాలావు ఆకలేస్తూండాలి! పొద్దునెప్పుడో తిన్నాడు? తొందరగా అన్నం మూట తీసుకెళ్తే ఆడెంతో సంబరపడతాడు.

అలా ఆలోచిస్తూ నడుస్తూ చిన్నోడు రావి చెట్టుదగ్గర కొచ్చాడు. చెట్టుకిందవున్న సమాధి చూసేసరికి వొళ్ళు జలదరించిపోయింది.

సుబ్బాయి మొండిధైర్యం చేసి తెగించి పరుగు లంకించుకొన్నాడు. రావిచెట్టు దగ్గర లేచిన లేవడం కట్టమీదకొచ్చి వాలాడు.

అన్నంమూట నెత్తిన పెట్టుకొని, మూట కట్టిన పంచ అంచు జారకుండా మెడచుట్టు తిప్పి కట్టుకొని, సర్రున కట్ట మీద నుంచి కాలవలోకి దూకి పరుగులేశాడు సుబ్బాయి. కట్టమీద నుంచి దిగిన విసురుడికి సుబ్బాయి కాలవలో నాలుగైదు గజాల దూరంలోపోయి పడ్డాడు; రొమ్ములుదాటి కంఠం వరకూ నీళ్ళొచ్చేసరికి చిన్నోడికి అంతా అయోమయమయి పోయింది.

నిన్నటి వరకూ కాలవలో నీళ్ల పూర్తిగా

తగ్గిపోయి వున్నాయి. కాలవ రెండు కట్టలకు ఆనుకొని నీళ్ళులేవు పది గజాల పాటు దూరంలో కాలవ మధ్యలో మాత్ర పాయగా మోకాటిలోతు నీళ్ళు మెల్లగా పారుతూండేవి ఇప్పుడు కాలవ అలాగే వుందనుకొని కాలవ దాటటానికి వచ్చాడు సుబ్బాయి. కాని యీ మధ్యలో కాలవ వదిలారు. పై నుంచి వరదలు వచ్చి ఏరు నిండింది ఏరు పొర్లుతూండగా పెద్ద కాలువ తలుపులు పూర్తిగా ఎత్తబడి నాయి. నిమిష నిమిషానికి కాలవ ఉబుకు తుంది! షావుకారు — ఇనసకట్టూ చక్రవడ్డీలా క్షణక్షణానికి కాలువనీటిమట్టం పెరుగుతూంది.

లంబాడి దెయ్యం ఊహంతో తత్తర పాటుతో వున్న సుబ్బాయి కళ్ళ చీకట్లో ఉబికి ఉబికి ఉరవళ్ళ పరవళ్ళతో ప్రవహిస్తున్న కాలువను చూపలేకపోయినై!

అకస్మాతుగా గొంతు వరకు నీళ్ళొచ్చే సరికి చిన్నోడికి మతిపోయింది, ఇదంతా లంబాడి దెయ్యం చేస్తున్న పనే అనుకున్నాడు. దూరంగా కట్టమీద తుమ్మచెట్ల వెనగ్గా రావి చెట్టు తలలు విరబోసుకుని కన్పిస్తోంది. గగ్గోలు పెట్టి అరిచాడు. ప్రవాహ వేగం చిన్నోడి శరీరాన్ని లోపలకు లాగివేస్తోంది. కాళ్ళ కింద ఇసుక తప్పుకొని సుడులు తిరుగుతోంది.

సుడిగుండంలో ఇరుక్కున్న సుబ్బాయికి చెయ్యీ, కాలు ఆడలేదు. గుండంలో పడి మునుగుతూ, తేలుతూ ప్రవాహ వేగంలో కొట్టుకుపోతున్న అన్నం మూట చిన్నోణ్ణి కిందకు లాగివేస్తుంది. తన తలమీద ఏదో విపరీతమయిన శక్తి కూచుని లోపలికి తొక్కుతూన్నట్టూ, గొంతుపట్టుకొని లోపలకు గుంజుకుంటోన్నట్టుగా అయిపోయింది చిన్నోడి పని!

చిన్నోడి ఖాళీ పొట్టలో కొత్తనీరు చేరింది! చిన్నోడి ఊపిరితిత్తుల్లోకి కొత్తనీరు చిమ్ముతోంది!

చిన్నోడు కళ్ళు తేలవేశాడు. కాళ్ళు, చేతులూ కొట్టుకోవడం మానివేసినయ్ —

నంగనాచిలా, తనకేమి తెలియనట్టే శ్రీవారి చింజీతాన్ని పొట్టలో దాచుకొని ఒడ్డునవున్న మట్టికోస్తూ కాలువ ప్రవహిస్తూ వుంది.

* * * *

సూర్యుడు కరకరా పొడిచి రెండు బారలు పైకి ఎక్కాడు శ్రీ రావుగారు వళ్ళు విరుచుకుంటూ నిద్రలేచారు

నిన్న చేసిన శ్రమదానానికి వళ్ళంతా విరగ్గొట్టేసినట్టుంది. అయితే ఏం? కష్టేఫలే! అన్నారు. రేపు ఉదయం పేపర్లలో తన చిత్రం....మట్టితట్టలు మోస్తోన్న చిత్రంతో సహా—ఉల్లిపాలెంలో జరిగిన శ్రమదాన కార్యక్రమం తాలూకు వార్తలన్నీ వస్తాయి. లక్షలాది ప్రజలు చదువుతారు. మహామహానాయకు లంతా తన చిత్రాన్ని చూస్తారు! ఈ దెబ్బతో తన నియోజకవర్గంలో ఎదురు ఎవరు నిలవగలుగుతాడు తనకు?

అలా ఆలోచిస్తూ మంచం దిగి శ్రీవారు బయట అరుగుమీద కొచ్చి కూర్చుని—

"ఒరే! చిన్నోడా? నీళ్ళు, వేప పుల్లా పట్టుకురారా!" అని బిగ్గరగా సాలెట్లోకి చూసి అన్నాడు.

చిన్నోడు రాలేదు! పలకలేదు!

శ్రీవారికి కోపం వచ్చింది. పిలవంగానే మనిషి హాజరవకపోతే రావుగారికి చెడ్డకోపం కలుగుతుంది నిద్రలేచేసరికి ముఖానికి నీళ్ళు, వేపపుల్లా సిద్ధంగా అరుగుమీద వుండాల్సింది యీ రోజు లేవు, పైగా జీతగాణ్ణి పిలిస్తే పలకడు! కోపం వచ్చిందంటే రాదు మరీ!

"ఒరే! సుబ్బాయ్? ఎక్కడ చచ్చావురా? పిలుస్తుంటే పలకవేరా" గర్జించారు శ్రీవారు.

నీళ్ళు తాగి వుబ్బి తేలి కొట్టుకొచ్చిన చిన్నోడి శవం ఉల్లిపాలేనికి రెండు మైళ్ళ దిగువనున్న కాలవలాకుల దగ్గర ఆగింది! శ్రీవారి శ్రమదానాన్ని గురించి శిలవలు పలవలుగా చెప్పుకొంటూన్న జనం లాకుల దగ్గిర తేలిన కుర్రాడి శవాన్ని చూసి బయటికి లాగారు.

శ్రీవారి గొంతు మళ్ళీ గర్జించింది—

"ఒరేయ్! చిన్నోడా! ఎక్కడ చచ్చావురా? నిన్నేరా పిలిచేది? వినబట్టంలా!......"

వినడానికి అక్కడ చిన్నోడు లేడు!

కనడానికి దేవుడూ లేడు!

(వనశ్రీగారి కథా సంపుటి 'శ్రీవారి శ్రమదానం' నుండి పునర్ముద్రితం.) ❋

దాసు మధుర భారతి

మినీకథ

# దర్జీవాడు

బొమ్మల పండగొస్తోంది, సోఫాలకు కొత్త కవర్లు కుట్టించాలని ఎన్నాళ్ళుగానో అనుకుంటున్నాం పేపరు తెరిస్తే చాలు ఎగ్జిబిషన్‌లు, రిడక్షన్‌లు, డిస్కౌంట్‌లూ అంటూ కన్నుల పండుగ్గా వుంటాయి రకరకాల ప్రకటనలు. అందులో ఇక్కడ ఢిల్లీలో సంవత్సరం పొడుగునా ఏవో ఎగ్జిబిషన్‌లు జరుగుతూనే వుంటాయి.

పది పర్సెంటన్నా సరే పరుగులు పెడారు జనం. తీరా వెళ్తే ఏడు పర్సెంట్ టాక్సు. చివరకు మిగిలేది రూపాయికి మూడు పైసలు. కరువు రోజుల్లో కొద్దిగా మిగిల్చినా గొప్పే. ఎలాగో తిరిగి తిరిగి కొన్ని గుడ్డ నచ్చక, కొన్ని డబ్బు నచ్చక వదిలేసి చివరకొక కొట్లో కొన్నాం గుడ్డ. కవర్లు కుట్టటానికి కొట్టువాడే మిషనువాణ్ణి పంపిస్తానన్నాడు.

సాయంత్రానికల్లా దర్జీవాడు వచ్చాడు భుజాని గదలాగా మిషను భుజాన పెట్టుకుని. పేరేమో కరార్‌సింగ్‌ట ఎర్రటి కళ్ళు, పాన్ వేసుకున్నాడేమో గారపట్టిన పళ్ళతో ఎర్రటి నోరు, పెద్ద మీసాలూ వాడూ, చూట్టానికేమో అచ్చం సినిమా విలన్‌లాగా వున్నాడు.

వస్తూనే ఇల్లంతా దొంగచూపులు చూట్టం మొదలెట్టాడు నాకూ, మా అమ్మాయికీ వాణ్ణి చూస్తుంటే దొంగాడేమోనని భయం పట్టుకుంది. మావారేమో "వెధవ భయాలూ మీరూనూ, అందరిమీదా అనుమానాలే, నేనున్నాగా మీ దవతలకెళ్ళండి" అన్నారు తనేదో వాణ్ణి పొడిచేసేటట్టు.

సోఫాలు బరబరా లాగాడు టేపు తీశాడు జేబులోనుంచి. పైకి క్రిందికి కొలతలేసి చకచకా కత్తిరి చేస్తున్నాడు. మధ్యమధ్య మా వంక చూస్తున్నాడు తమాషాగా. మేం తెలుగులో వాణ్ణిగురించి మాట్లాడుకుంటున్నాం. 'ఇలాంటివాళ్ళే పగలు ఇల్లంతా తనిఖీచేసి, రాత్రికి దొంగతనాని కొస్తారట....వాడేమిటి అలా దొంగచూపులు చూస్తాడు వీళ్ళన్నీ బయటపెట్టి దొంగనవ్వు నవ్వుతాడు.' అని పెద్దగానే అనుకుంటున్నాం.

వాణ్ణి మాట్లాడిద్దామని "కహాఁకే రహనే వాలే హై" అన్నా. అంతే, ఆపకుండా వాగటం మొదలెట్టాడు హిందీలో. వాడిది మీరట్‌ట. వాళ్ళ నాన్నేమో ఆర్మీలో పనిచేశాట్ట అందుకని ఇండియా అంతా చూసేశాట్ట. సికిందరాబాద్ చాలా నచ్చిందట ఇడలీ (ఇడ్లీ) చాలా ఇష్టంట. డోషాలు (దోసెలు) డజనైనా లాగించేస్తాడట ఏవేవో చెప్తూ కత్తిరించటం పూర్తి చేశాడు.

ఒక కవరు కుట్టేడో లేదో 'అభీ ఆయేంగే దస్ మినిట్‌మె' అంటూ బయటికెళ్ళిపోయాడు. పది నిమిషాలు, పావుగంట, అరగంటవుతోందిగాని వాడుమాత్రం పత్తాలేడు. మా భయం ఎక్కువవటం మొదలయింది. 'వీడు తప్పకుండా దొంగే అయివుంటాడూ, ఇంకా యిద్దర్ని తేవటానికి వెళ్ళాడేమో, వచ్చాక ఏ పిస్టలో చూపిస్తే ఏం చెయ్యాలి?'